# ఇన్లాండ్ లెటర్ కథలు

## తెలివి



వరుణ్ పెళ్లి చూపులకు తల్లిదండ్రులతో కలసి వెళ్ళాడు. కుందనపు బొమ్మ లాంటి రోజా వరుణ్‌తో బాటు అందరికీ నచ్చింది. అందంతో పాటు తెలివితేటలు కూడా కలిగిన పిల్ల తనకు కోడలిగా రావాలని వరుణ్ తల్లి కోరిక. అందుకే తనకు కాబోయే కోడలి తెలివితేటలు పరీక్షించదలచి కొన్ని ప్రశ్నలు వేయాలనుకుంది.

ఇంతలో రోజా కాఫీలు తీసుకొచ్చింది. దాన్ని అందుకుంటూ, 'భాస్కరునితో పోటీ పడడం ప్రతి స్త్రీకి అవసరం ఏమంటావ్?' అని అడిగింది వరుణ్ తల్లి.

'భాస్కరుని కన్నా నేనెప్పుడూ ముందే. ఆ విషయంలో మీరు నిశ్చింతగా వుండండి' అంది రోజా.

'నాలుక్కి మంత్రం వేయడం వచ్చా లేదా పండగలకు పబ్బాలకు ఎదురు చూడాల్సిందేనా?' అని రెండో ప్రశ్న అడిగింది ఆమె.

'నేను గిన్నెలో గరిటె తిప్పాను అంటే నాలుక నాగస్వరం విన్న పాములా ఆడాల్సిందే' అంది రోజా.

'ధన్వంతరి ఇంటికి దారెటు?' మూడో ప్రశ్న అడిగింది వరుణ్ తల్లి.

'ఏమో నేనూ ఆరా తీయాలి' అని సమాధానం యిచ్చింది. రోజా సమాధానాలు విని తన కోడలు కాబోతున్నందుకు సంతోషించింది వరుణ్ తల్లి. మంచిరోజులు చూచి ముహూర్తాలు పెట్టుకుందామని అక్కడ్నించి బయల్దేరారు.

దారిలో వరుణ్ తల్లితో, 'అమ్మా! నువ్వు ఆ అమ్మాయి మాట్లాడుకున్న దాంట్లో నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు' అన్నాడు.

ఆమె నవ్వి ఇలా అంది "భాస్కరునితో పోటీ పడటం అంటే ఉదయాన్నే లేస్తావా? అని అర్థం" ఆ విషయంలో నిశ్చింతగా వుండండి అని సమాధానం చెప్పింది. అంటే సూర్యునికన్నా ముందే లేస్తాను అని అర్థం. ఇక "నాలుకకు మంత్రం వేయడం వచ్చా లేదా పండగలకూ, పబ్బాలకూ ఎదురు చూడాల్సిందేనా" అంటే అంటే వంట బాగా రుచి. చేస్తావా? సోమరితనం లేక పిండివంటలు చేస్తావా లేదా పండగలూ, పబ్బాలకూ మాత్రమే చేస్తావా? అని అర్థం. 'నేను గిన్నెలో గరిట్టే తిప్పానంటే నాలుక నాగస్వరం విన్న నాగుపాములా ఆడాల్సిందే' అంది ఆ అమ్మాయి. అంటే నేను వంట చక్కగా చేయగలనని అర్థం. "ధన్వంతరి యింటికి దారెటు?" 'ఏమో నేను ఆరా తీయాలి' అంది రోజా. దానికర్థం 'నాకు ఇంతవరకు అనారోగ్యం అనేది తెలియదు' అని, తెలిసిందా ఆమె తెలివి అంది వరుణ్ తల్లి.

తల్లి వివరణ విన్న తరువాత తెలివైన భార్య లభించబోతున్నందుకు ఆనందించాడు వరుణ్.

కె.రవికుమార్.

---

## కట్నం

'ఏమండీ! అమ్మాయి చాలా బాగుంది కదండీ! తల్లిదండ్రి చిన్నతనంలో. నే చనిపోతే చిన్నాన్న దగ్గరే పెరిగిందట. ఎంత వినయంగా నెమ్మదిగా వుంది? మన కోడలు ఎలా వుండాలని అనుకునేదాన్నో అచ్చుగుద్దినట్లు అలానే వుందండీ. నాకైతే యీ సంబంధం చాలా నచ్చింది. మీరేమంటారు? అడిగింది జానకి భర్తని.

"జానకీ! ఆ అమ్మాయి నాకు కూడా నచ్చింది. అబ్బాయికి ఈడూ జోడూ సరిగ్గా సరిపోతుంది. అయినా మనిద్దరికీ నచ్చితే సరిపోతుందా? అబ్బాయికి నచ్చాలి కదా! ఫోటో పంపించాము కదా! చూద్దాం ఏమంటాడో".

"మనకున్నది ఒక్కడే అబ్బాయి. వైజాగ్ 'స్టీలుప్లాంట్' లో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. మనకు ఆస్తిపాస్తులు కూడా బాగానే వున్నాయి కాబట్టి మనం 'కట్నం' తీసుకోకుండా పెళ్ళి చేద్దామండీ కూతురైనా కోడలైనా ఆ అమ్మాయే కదా! ఏమంటారు?

'సరే లేవోయ్ నీ యిష్ట ప్రకారమే చేద్దాం. అబ్బాయికి నచ్చితే, మనమే పెళ్ళి ఖర్చులు కూడా పెట్టి వైభవంగా పెళ్ళిచేద్దాం.' అన్నారు ఆనందరావు.

భర్త కూడా అంగీకరించడంతో, సంతోషంగా మిగతా విషయాల గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది జానకి.

* * * *

పోస్టుమెన్ ఇచ్చిన కవర్ విప్పాడు ఆనందరావు.

'పూజ్యులైన అమ్మగారికి, నాన్నగారికి,

నేను క్షేమం. మీ లెటర్ అందింది. ఫోటో చూసాను. అమ్మాయి నాకు నచ్చింది. మీకు అన్ని విధాలా నచ్చితే పెళ్ళి నిశ్చయం చేయండి. యిక్కడ నాతో పనిచేస్తున్న ఫ్రెండ్స్ చాలామంది రెండులక్షలకి తక్కువ కాకుండా 'కట్నం' తీసుకుంటున్నారు. మనం కూడా అంతకు తగ్గకుండా



తీసుకుంటే బాగుంటుంది. లేకపోతే వాళ్ళందరి ముందు నాకు చిన్నతనంగా వుంటుంది. మీ యిద్దరి ఆరోగ్యం జాగ్రత్త వుంటాను.

మీ,

వంశీ.

ఉత్తరం పూర్తిగా చదివే సరికి ఆనందరావు, జానకి మొహంలో రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయాయి.

స్వర్ణశైలజ.